సింహపురిలో ప్రశాంతత కరువు

- హత్యలు.. హత్యాయత్నాలు
- బరితెగిస్తున్న నేరస్తులు
- భయం గుప్పిట్లో నగర వాసులు

నెల్లూరు(క్రైమ్): ప్రశాంతతకు మారుపేరైన నగరంలో అశాంతి నెలకొంటోంది. వరుస హత్యలు, హత్యాయత్నాలతో నగర వాసులు భయం గుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నారు. పాత నేరస్తులు, కొందరు యువత కత్తులతో సహవాసం చేస్తున్నారు. మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు. రెండున్నర నెలల వ్యవధిలో ఆరు హత్యలు చోటుచేసుకున్నాయంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది. నేతల మితిమీరిన జోక్యంతో పోలీస్ అధికారులు నామమాత్రపు చర్యలకే పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో నేరాలు పెరుగుతున్నాయి. ఎప్పుడు ఏమి జరుగుతోందననే అభద్రతభావంతో నగర వాసులు కాలం గడుపుతున్నారు.




హత్యకు గురైన ముక్తియార్, పాల్ (ఫైల్)

దడ పుట్టిస్తున్న వైనం

రౌడీషీటర్లు, పాత నేరస్తులకు అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉండటంతో వారు బరితెగిస్తున్నారు. కత్తులతో సంచరిస్తూ ప్రత్యర్థులను అతి కిరాతకంగా హత్య చేస్తున్నారు. మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదని స్థానికులపై దాడులకు తెగబడుతున్నారు. దారిన వెళ్లేవారిని అకారణంగా హతమార్చేందుకు సైతం వెనుకాడటం లేదు. నేరస్తులు, అనుమానాస్పద వ్యక్తులు, జైలు నుంచి విడుదలైన వారి కదలికలపై పోలీసుల నిఘా కొరవడింది. ఏదైనా ఘటన చోటుచేసుకున్న సమయంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆపై పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి. అనేక మంది రౌడీషీటర్లు అధికార పార్టీ నేతల ముఖ్య అనుచరులు కావడంతో వారు కౌన్సెలింగ్‌కు గైర్హాజరవుతున్నా, పోలీస్ అధికారులు మిన్నకుండిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కత్తుల సంస్కృతి

మునుపెన్నడూ లేని విధంగా నెల్లూరులో కత్తుల సంస్కృతి పెరుగుతోంది. కొందరు యువత కత్తులు చేతబూని రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్నారు. పుట్టిన రోజు వేడుకల పేరిట బహిరంగ ప్రదేశాల్లో భారీ కేకులను కత్తులతో కట్ చేయడం ఆనవాయతీగా మారింది. వేడుకల పేరిట నానాయాగీ చేస్తూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వారించిన పోలీసులపై దౌర్జన్యంగా వ్యవహరిస్తున్న ఘటనలూ లేకపోలేదు. అధికార పార్టీ నేతల ముఖ్య అనుచరులం.. తమతో పెట్టుకుంటే ఆ స్టేషన్లో లేకుండా చేస్తామంటూ బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారు. దీంతో చేసేదేమీలేక పోలీసులు వెనుదిరుగుతున్నారు. పోలీస్ అధికారులు ఇప్పటికైనా నేరాలకు అడ్డుకట్టవేయకపోతే నగరంలో శాంతిభద్రతలు మరింత అదుపుతప్పే ప్రమాదం పొంచి ఉంది.

రెండున్నర నెలల్లో చోటుచేసుకున్న ఘటనలు..

➡ ఆగస్టు 14.. బీవీనగర్ రైల్వే గేట్ సమీపంలో రోడ్డుపై ఎందుకు అల్లరి చేస్తున్నారని ప్రశ్నించిన వేణును కొందరు దారుణంగా హతమార్చారు.

➡ ఆగస్టు 26.. రామలింగాపురం అండర్‌బ్రిడ్జి సమీపంలో పాతనేరస్తుడు గుంజి రవి అలియాస్ కత్తి రవిని పాతకక్షల నేపథ్యంలో స్నేహితులే అతి కిరాతకంగా హత్య చేశారు. నిందితలందరూ పాత నేరస్తులే.

➡ సెప్టెంబర్ మూడు.. ముత్యాలపాళెంలో పాల్‌ను ఆర్థిక విభేదాల నేపథ్యంలో సహచరులే హత్య చేశారు. నిందితుల్లో కొందరు పాత నేరస్తులున్నారు.

➡ అక్టోబర్ 15.. ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలో రౌడీషీటర్ వాకా అశోక్‌ను ఉడ్‌హౌస్‌సంఘానికి చెందిన రాము, సందీప్ దారుణంగా హత్య చేశారు. మాటామాటా పెరగడమే హత్యకు కారణం.

➡ అక్టోబర్ 21.. పాతకక్షలను మనస్సులో పెట్టుకొని శ్రామికనగర్‌లో యాసిర్‌పై అదే ప్రాంతానికి చెందిన బ్రహ్మనాయుడు కత్తితో దాడి చేశారు.

➡ అక్టోబర్ 22.. చంద్రమౌళీనగర్‌లో ప్రొవిజన్స్ షాపు యజమాని సుబ్బారావును కత్తితో బెదిరించి డబ్బును పాత నేరస్తుడు సాజిద్, అతని అనుచరుడు విజయ్‌కుమార్ దోచుకెళ్లారు.

➡ అక్టోబర్ 24.. ఆటో మెకానిక్ ముక్తియార్ పట్టపగలు దారుణహత్యకు గురయ్యారు.

క్లుప్తంగా

మనుచరిత్ర మహాకావ్యం



మాలకొండయ్యను సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్ర మహాకావ్యమని ఆచార్య మాలకొండయ్య తెలిపారు. పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో ఆదివారం నిర్వహించిన మనుచరిత్ర – అల్లసాని పెద్దన.. జీవన మహాసందేశం కార్యక్రమంలో ఆయన ఉపన్యసించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మెట్టు రామచంద్రప్రసాద్, గోవిందరాజు సుభద్రాదేవి, నలుబోలు బలరామయ్యనాయుడు, నిర్వాహకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, శేషగిరీశం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

నెల్లూరు(బారకాసు): నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నామని కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సమస్యలపై ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు అర్జీలను అందజేయాలని కోరారు.

కుంకాళమ్మ ఆలయ అర్చకుడి మృతి



శ్రీనివాసులుశర్మ

ఇందుకూరుపేట : మండలంలోని లేబూరు గ్రామంలో కొలువైన కుంకాళమ్మ ఆలయ అర్చకుడు పోగుల శ్రీనివాసులుశర్మ(58) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వెంకటాచలం : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని చెముడుగుంట వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. శ్రీకాకుళానికి చెందిన కృష్ణ(47) చెముడుగుంట వద్దనున్న రైస్ మిల్లులో పనిచేస్తున్నారు. పనినిమిత్తం నెల్లూరుకు వెళ్లి తిరిగి ఆటోలో చెముడుగుంటకు వచ్చారు. రైసు మిల్లుకు వెళ్లేందుకు జాతీయ రహదారిని దాటుతుండగా గూడూరు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కృష్ణ అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రూ.15 లక్షలకు బెల్టు షాపు

- నేలటూరు పట్టపుపాళెంలో వేలంపాట



నేలటూరు పట్టపుపాళెం

ముత్తుకూరు, నెల్లూరు : ముత్తుకూరు మండలం, నేలటూరు పంచాయతీలోని పట్టపుపాళెంలో మద్యం బెల్టు షాపునకు వేలంలో రూ.15 లక్షలకు పలికింది. ఇటీవల జరిగిన వేలంపాటలో స్థానిక టీడీపీ వర్గీయులు ఇక్కడి బెల్టు షాపును ఈ మొత్తానికి చేజిక్కించుకున్నారు. నేలటూరు ప్రధాన గ్రామంలో ఏర్పాటైన లైసెన్సు మద్యం షాపునకు ఈ బెల్టు షాపు బ్రాంచ్‌గా పనిచేస్తుంది. స్థానిక వ్యాపారస్తులు వేలం రూపంలో చెల్లించే రూ.15 లక్షలను గ్రామం కోసం ఖర్చు చేస్తారు. దీనిని ప్రతి నాలుగు మాసాలకు రూ.5 లక్షలు చెల్లించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. పట్టపుపాళెంలో సుమారు 500 కుటుంబాలున్నాయి. ఈ పాళెంలో చదువుకున్న యువకులు సమీపంలోని థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల్లో పనిచేస్తుండగా, అత్యధిక కుటుంబాలు సముద్రంలో చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. వేలంలో రూ.15 లక్షలకు బెల్టు షాపు సొంతం చేసుకొన్నారంటే ఇక్కడ వ్యాపారం ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

కామాక్షితాయి హుండీ కానుకల లెక్కింపు రేపు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు చేపడుతామని ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీ కానుకల లెక్కింపు నిర్వహిస్తామని వివరించారు. భక్తులు, ధర్మకర్తల మండలి సభ్యులు హాజరు కావాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు(అర్బన్): నగరంలోని ఏఆర్ కిడ్నీ ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత ప్రొస్టేట్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆస్పత్రి అధినేత డాక్టర్ నిశ్చలప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. ఉచిత కన్సల్టేషన్‌తో పాటు అల్ట్రాసౌండ్ స్కాన్, యూరిన్ ఎగ్జామినేషన్ పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులను అందజేశామని చెప్పారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



నెల్లూరు(బృందావనం): నగరంలోని వివిధ ప్రాంతాల్లో పేదలు, వృద్ధులకు దుప్పట్లను బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిర యువ సేవాదళ్ ఆధ్వర్యంలో ఆదివారం వేకువజామున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి మాట్లాడారు. సాయిబాబా ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకొని దాతల సహకారంతో 500 మందికి దుప్పట్లను అందజేశామని వివరించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం




నెల్లూరు(బృందావనం): సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ మందిర ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన గణపతి సచ్చిదానంద స్వామి దివ్యనామ సంకీర్తన, వక్తృత్వ పోటీలకు విశేష స్పందన లభించింది. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

నిరాశ్రయుల కేంద్రంలో అన్నదానం



నెల్లూరు(అర్బన్): వృద్ధులకు ప్రేమానురాగాలను పంచుతూ వారిని ఆదరించడం ప్రతి ఒక్కరి ధర్మమని పల్మనాలజిస్ట్ ప్రేమ్‌దీప్ పేర్కొన్నారు. డాక్టర్లు ఆదర్శ్, కవిత కుమారుడు తేజాన్ష్ జన్మదినాన్ని పురస్కరించుకొని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద గల నిరాశ్రయుల ఆశ్రమంలో అన్నదానాన్ని ఆదివారం నిర్వహించారు. పీహెచ్‌పీ జిల్లా గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, నారాయణ డెంటల్ కళాశాల హెచ్‌ఓడీ నటరాజన్ కణ్ణన్, నేతలు దేవరకొండ శ్రీనివాసులు, మాలిని, రామదాసు, మహబూబ్‌బాషా, ఆయేషా, ఆశ్రమ నిర్వాహకుడు సుందరం తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు



నెల్లూరు(క్రైమ్): పర్యావరణ పరిరక్షణలో పోలీసుల సవాళ్లు అనే అంశంపై పోలీస్ సిబ్బందికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను ఆదివారం నిర్వహించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన పోటీలను ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేయనున్నామని చెప్పారు. ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐలు హరిబాబు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి




ప్రథమ స్థానంలో నిలిచిన కేఎన్నార్, కోవూరులోని రత్నం పాఠశాల విద్యార్థులు

నెల్లూరు(అర్బన్): విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని డిప్యూటీ డీఈఓ లక్ష్మీప్రసూన, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి పేర్కొన్నారు. బీవీనగర్‌లోని సంఘమిత్ర పాఠశాలలో జేవీవీ జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను ఆదివారం నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి మండల స్థాయిలో ఎంపికైన 150 మంది జిల్లా స్థాయి పోటీలకు హాజరయ్యారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి కోవూరులోని రత్నం స్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతిని అందుకున్నారు. ప్రభుత్వ స్కూళ్ల నుంచి బీవీనగర్‌లోని కేఎన్నార్ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రామచంద్రారెడ్డి ఆస్పత్రికి చెందిన సీనియర్ డాక్టర్ దత్తాత్రేయ, జేవీవీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్‌భాస్కర్, కృష్ణారెడ్డి, నగరాధ్యక్ష, కార్యదర్శులు విజయకుమార్, మోహన్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, కామయ్య, సంఘమిత్ర పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధనకు పోరాటం



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్సీ వర్గీకరణ సాధనకు పోరాటాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జేఏసీ కన్వీనర్ జనార్దన్, ప్రధాన కార్యదర్శి గడ్డం శేఖర్ పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఎస్సీ వర్గీకరణ పరిరక్షణ కమిటీ ఐక్యవేదిక సమావేశంలో వీరు మాట్లాడారు. భవిష్యత్తు కార్యాచరణపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో డీఎస్సీ నోటిఫికేషన్‌ను నవంబర్‌లో విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఎస్సీ వర్గీకరణ అమలయ్యేంత వరకు దీన్ని ఆపాలని కోరారు. జేఏసీ గౌరవాధ్యక్షుడు పందిటి సుబ్బయ్యమాదిగ, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు బద్దెపూడి రవీంద్ర, కో కన్వీనర్ కృష్ణయ్య, రత్నం, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్న సంతర్పణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): అయ్యప్ప దీక్షధారులకు అన్న సంతర్పణను వెంకటేశ్వరపురంలో అయ్యప్ప సేవా భక్త బృంద ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్త బృంద అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి మాట్లాడారు. అయ్యప్ప మాలధారులకు అన్న సంతర్పణను స్థానిక వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 41 రోజుల పాటు మధ్యాహ్నం నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

నిందితుడిపై కఠిన చర్యలు చేపట్టాలి



నెల్లూరు (టౌన్): అనంతసాగరం మండలం కొత్తపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యయత్నానికి కారణమైన నిందితుడిపై కఠిన చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీహర్ష డిమాండ్ చేశారు. నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. విద్యార్థినికి కళాశాల యాజమాన్యం టీసీ ఇవ్వడం సరికాదని చెప్పారు. నేతలు చరణ్, విష్ణు, జీవన్, యశ్వంత్, రంజిత్, పవన్ పాల్గొన్నారు.

ఆర్ట్స్, క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం



నెల్లూరు(బృందావనం): నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంక్ ఎదురుగా గల మైదానంలో కళాంజలి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యూ క్రాఫ్ట్స్ ఇండియా క్రాఫ్ట్స్ బజార్ ప్రదర్శనను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శ్రీనివాస్, శాంతిప్రసన్న మాట్లాడారు. కలంకారి, లఖ్‌నవూ చికన్ వర్క్స్, జైపూర్ బెడ్‌షీట్స్, వరంగల్ తువాళ్లు, కశ్మీరీ టాప్స్, బెంగాలీ కాటన్‌చీరలు, భాగల్‌పూర్ ఫ్యాన్సీ శారీస్ తదితరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రదర్శన డిసెంబర్ పది వరకు రోజూ ఉదయం పది నుంచి రాత్రి పది వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

డాక్టర్ చంద్రశేఖర్‌కు సత్కారం



నెల్లూరు(బృందావనం): ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తూ బదిలీ అయిన డాక్టర్ చంద్రశేఖర్‌ను వనంతోపు సెంటర్ సమీపంలోని జనహిత, వాత్సల్య కేంద్రంలో ఆదివారం సత్కరించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు హాజరయ్యారు. మానవసేవే మాధవసేవ టీమ్ నిర్వాహకులు పరిమళ, విశ్వనాథం, కల్పం శ్రీనివాసులు, విజయమ్మ, ఖాదర్‌బాషా, బాలు, మల్లికార్జున, కేంద్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాంబశివరావు, మల్లికార్జున, గిరి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహాకుంభాభిషేక మహోత్సవాలు



సౌభాగ్య సరస్వతి, బ్రహ్మదేవుల కల్యాణోత్సవం

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని కుర్తాళం సిద్ధేశ్వరి పీఠపాలిత గురుదత్తాత్రేయ మఠంలో సౌభాగ్య సరస్వతి అమ్మవారు, పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. యాగశాలలో పూజలు, హోమాలు, ప్రాయశ్చిత హోమం, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, మహాకుంభాభిషేకం, వసంతోత్సవం తదితరాలను వేడుకగా నిర్వహించారు. గోపుర కలశ ప్రతిష్ఠను కనులపండువగా జరిపారు. సౌభాగ్య సరస్వతి అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠించిన దత్తాత్రేయ, ఆదిశంకరాచార్యులు, హరిహరేశ్వర, సిద్ధిగణపతి, ధన్వంతరి, అభయాంజనేయ స్వామి తదితర దేవతామూర్తులకు పూజలను వేడుకగా జరిపారు. అనంతరం 32 మంది దేవతామూర్తులతో పాటు సౌభాగ్య సరస్వతి కల్యాణ మహోత్సవాలను ఏకకాలంలో చేశారు. అనంతరం కుర్తాళం సిద్ధేశ్వరి పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతి అనుగ్రహభాషణ చేశారు. పీఠ ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్‌శర్మ, మఠం మేనేజర్ మాచవోలు అనూరాధ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో తిరుపతి శక్తిపీఠాధీశ్వరులు రమ్యానంద భారతి, ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన కమిటీ నిర్వాహకులు పత్రి గురురాజా, పాలడుగు సాయి, రాజా శ్రీనివాసరావు, శ్రీధర్, మధుసూదన్‌రావు, ఏడుకొండలు, దొంతంశెట్టి వినయ్ తదితరులు పాల్గొన్నారు.



గోపురంపై ప్రతిష్ఠించిన పవిత్ర కలశాలు



మహాపూర్ణాహుతిని నిర్వహిస్తున్న రుత్విక్కులు

స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్‌పై హర్షం



మాట్లాడుతున్న యశ్వంత్‌సింగ్

నెల్లూరు(బారకాసు): స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్‌కు కేబినెట్ ఆమోదించడంపై బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ హర్షం వ్యక్తం చేశారు. చిన్నబజార్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. స్వర్ణకారుల సంక్షేమానికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీజేపీ నేతలు ఖాదర్‌బాషా, సుమన్, రాజశేఖర్, సుందరం, మస్తాన్, మహేష్, సూరి, శౌరి తదితరులు పాల్గొన్నారు.